కాలి బూడిదైన జీడి తోట : రూ.30 లక్షల పంట నష్టం

గిరిజన రైతుల ఆందోళన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని, చామలాపల్లి పంచాయతీ శివారు వెంకయ్యపాలెం గిరిజన గ్రామంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి సుమారు 10 ఎకరాల జీడి తోటలు కాలి బూడిదయి రూ.30లక్షల పంట నష్టం జరిగింది. గ్రామానికి చెందిన సుమారు 8మంది గిరిజన రైతుల పోడుభూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవనాధారమైన జీడితోటలో పంట దశకు చేరుకొని పంట చేతికొచ్చే సమయంలో అగ్నికి ఆహుతై కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని గిరిజన రైతులు వాపోతున్నారు. ఈ ప్రమాదం వల్ల సుమారుగా 30 లక్షల వరకు చేతికి అంది వచ్చే పంట నష్టం సంభవించినట్లు గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. మాజీవనదారం ఈ జీడీ

తోటే అని మేము ఎలా బ్రతకాలని జోడి పెంటయ్య, జోడి చిన్నయ్య దొర, జోడి చిన్న, కసరాజు రమణ, కసరాజు సోములు, జోడి అక్కయ్య తదితరులు వాపోతున్నారు. పంట నష్టం వచ్చేలా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

12, 13 తేదీల్లో పోలింగ్ స్టేషన్ల పరిధిలో సెలవు ప్రకటన

కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం: పట్టభద్రుల ఎంఎల్.సి ఎన్నికను పురస్కరించుకుని పోలింగ్ రోజు అనగా ఈ నెల 13 న, పోలింగ్ ముందు రోజు 12 న లోకల్ హాలిడే గా ప్రకటించినట్లు కలెక్టర్ ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో పోలింగ్ జరుగుతున్న 72 పోలింగ్ స్టేషన్ల పరిధి లో ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. మిగిలిన కార్యాలయాల విధులు యధావిధిగా జరుగుతాయని తెలిపారు..

మంత్రి బొత్స నేడు జిల్లాకు రాక

విశాలాంధ్ర-విజయనగరం: మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం గజపతి నగరం, మధ్యహ్నం శ్రీకాకుళం జిల్లా రణస్థలం లో ఏర్పాటయ్యే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోండి

- మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

విశాలాంధ్ర-బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ టి వాసు దేవన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సరోజనమ్మ, అడిషనల్ జూనియర్ జడ్జి జే సౌమ్య జోష్ని లు గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా హక్కుల పైన మహిళా చట్టాల పైన మండల అభివృద్ధి కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు లతో భారీ ర్యాలీ నిర్వహించారు. వరకట్న వేధింపుల చట్టం గృహహింస, తదితర చట్టాల పైన అవగాహన కల్పించారు.

కిడ్నీ సమస్యను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే డయాలసిస్ అవసరం ఉండదు

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: కిడ్నీ సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి సకాలంలో చికిత్స చేసుకుంటే ప్రమాదకరమైన డయాలసిస్ అవసరం ఉండదని ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ ఆర్. శ్రీకాంత్, యువ నెఫ్రాలజిస్ట్ (కిడ్నీ) డాక్టర్ ఆర్.శివకుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ఈనెల 31 వరకు కేవలం 699 ప్రత్యేక కిడ్నీ చెకప్ ప్యాకేజీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిపి, షుగర్ తో పాటు కాళ్లు వాపులు, మూత్ర సమస్యలు వస్తే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి ప్రాథమిక స్థాయిలో చికిత్స చేయించుకుని మందులు వాడి కిడ్నీలు పాడవకుండా నియం త్రిస్తే డయాలసిస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉండదన్నారు. కిడ్నీలో రాళ్లు, ప్రోస్టేట్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. తిరుమల మెడికవర్ చైర్మన్ డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ కిడ్నీ డే సందర్భంగా రూ.4వేలు విలువచేసే కిడ్నీ చెకప్ ను కేవలం 699కు ప్రత్యేక కిడ్నీ చెకప్ కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేదీ వరకు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. రవికిరణ్, తిరుమల మెడికవర్ సెంటర్ హెడ్ పద్మ కుమార్, ఏవో నారాయణ పాల్గొన్నారు.

22 మంది హైరిస్క్ గర్భిణీలు గుర్తింపు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామి లోని పీహెచ్సీలో గురువారం పిఎంఎస్ఎంఎ పథకంలో భాగంగా గర్భిణీలకు నెలవారి తనిఖీలను నిర్వహించారు. వైద్యాధికారిని డా. ఎస్. భాగ్యరేఖ గర్భిణీలకు వైద్య తనిఖీలను నిర్వహించారు. మొత్తం 75 మంది గర్భిణీలు హాజరుకాగా వారిలో 22 మందిని హైరిస్కు కేసులుగా గుర్తించారు. అలాగే మరో ఆరు కేసులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి సత్వర చికిత్సను అందిస్తున్నామన్నారు హై రిస్క్ వున్న గర్భిణీలకు తగిన సలహాలను, సూచనలను ఇచ్చామని, వారిపై తమ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.

మెంటాడలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-మెంటాడ: మండలంలోని కేంద్రంలో గురువారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విజయనగరం జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. గ్రామంలో ఉన్న అన్ని ప్రధాన వీధులలోనూ మెంటాడ జడ్పీ హైస్కూల్ చిన్నారులు, అంగన్వాడీలు, సచివాలయ ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో పాటు వక్తృత్వ, ముగ్గుల పోటీలలో గెలుపొందిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ మేరకు జన విజ్ఞాన వేదిక ప్రతినిధి గద్రేటి అప్పలనాయుడు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాలలోనూ తమ ప్రతిభ పాటవాలను చాటుతున్నారన్నారు. బాల్యవివాహాలు ప్రగతికి అవరోధమైన విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. సఖి గ్రూపులను మరింత చురుగ్గా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో త్రివిక్రమ్ రావు, తహసీల్దార్ ఆదిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయ సహకారాలతో విద్యార్థులు అలాగే మహిళలు అభివృద్ధి పథంలో నడిచేందుకు కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీలు, జడ్పీ హైస్కూల్ బాలికలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు ముమ్మరం

విశాలాంధ్ర-రామభద్రపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు ముమ్మ రం చేశామని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న అంతర్ జిల్లా చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ ప్రతి వాహనాన్ని తనిఖీలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యము, డబ్బులు అక్రమ రవాణా జరక్కుండా నిరోధించడమే పోలీసులు కర్తవ్యం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఈ ఆర్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

సుధాకర్ కి మద్దతుగా ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రచారం

విశాలాంధ్ర-డెంకాడ : ఎమ్మెల్సీ అభ్యర్థి కి మద్దతుగా ప్రచారం ఈనెల 13వ తేదీన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు డెంకాడ మండలంలో పెదతాడివాడ గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కి మద్దతుగా ఎన్నికల ప్రచారం గురు వారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సీతంరాజు సుధాకర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసినదిగా ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ త్రినాథ్, ఎంపీటీసీ సభ్యులు రమేష్, జగన్నాథం, స్కూల్ చైర్మన్ శ్రీరాములు నాయుడు, జెసిఎస్ కన్వీనర్ సారిక గౌరి, పిల్లా రమణ, శ్రీను రాజు,అప్పలనాయుడు, కృష్ణ, యడ్ల సత్యం,ఇమంది శ్రీను, సురేష్, గోపి గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో చుక్కపేట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్లకి చెందిన యువకుడు సందీప్ మృతి చెందాడు. గరివిడి నుండి నెల్లిమర్ల వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సందీప్ అక్కడకక్కడే మృతి చెందగా శేఖర్, సాయి అని యువకులకు గాయాలయ్యాయి. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరంజీవిరావును గెలిపించాలంటూ టీడీపీ ప్రచారం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి మండలం గొల్లలములగాం గ్రామంలో, చీపురుపల్లి మండల టీడీపీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు, గొల్లలములగాం గ్రామ టీడీపీ అధ్యక్షులు గడే సన్యాసప్పల నాయుడు ఆధ్వర్యంలో గురువారం చీపురుపల్లి మండలం గొల్లల ములగాం గ్రామంలో స్కూల్, సచివాలయం, గ్రామంలో ఉన్న పట్టభద్రులు ఓటర్లను కలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొల్లల ములగాం మాజీ సర్పంచ్ గడే లక్ష్మీ, గడే సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఆరతి సాహు, కక్కి భీమరాజు, గడే సీతం నాయుడు, కలిశెట్టి రామునాయుడు, గడే రామకృష్ణ, గడే అప్పల నాయుడు, గడే హరినాయుడు, గడే చిన్న, అలమండ మహేష్, రేగ త్రినాథరావు, గుణుపూరు ఆదినారాయణ, రౌతు షణ్ముఖ రావు, బుంగ మహేష్, తెలుగుదేశం పార్టీ యువత తదితరులు పాల్గొన్నారు.ప్రతి ఓటరుని కలిసి టీడీపీ బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు.

గ్రీన్ అంబాసిడర్ కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ఏఐటియుసి జిల్లా కన్వీనర్ పురం అప్పారావు

విశాలాంధ్ర-గుర్ల: మండల కేంద్రంలో గురువారం రిలే నిరాహారదీక్షలు పారిశుధ్య కార్మికులు చేపట్టారు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకి 12 నెలల నుంచి వేతనాలు బకాయిలు ఉంటే కేవలం 3 నెలల జీతాలు మాత్రమే వేయమని చెప్పడం చాలా దుర్మార్గమని ఏఐటియుసి జిల్లా కన్వీనర్ అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు పోలు రాజు అధ్యక్షతన జరిగిన రిలే నిరాహార దీక్ష ఏ.పి.గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ఇటీవల కాలంలో కేంద్రం నుండి విడుదల అయిన 15 వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులను పంచాయితీలకి కార్మికుల పొట్టలు కొట్టి మరొకరి పొట్టలు నింపడమే అవుతుందని విమర్శించారు. పంచాయతీల సొమ్మును వైసిపి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికి పథకాల పేరుతో ఓటర్లను కొనడమే అవుతుందని దుయ్యబట్టారు. ఎవరికి కేటాయించిన నిధులను వారి కోసం ఖర్చు చేయకుండా ఉచిత పథకాలు పంచేస్తే, పన్నుల రూపంలో వస్తున్న ప్రజా ధనం ఏమౌతుందని ప్రశ్నించారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకి 12 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వాళ్ళు బ్రతుకులు ఎలా ఉన్నాయో అని కనీసం మానవత్వంతో ఆలోచించే పాలకులు, అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 3 నెలల జీతాలు చెల్లించమని ఒక నిర్లక్ష్య ప్రకటన చేయడం వలన సర్పంచులు అందరూ వాళ్ళ ఆస్తుల్లో వాటాలు ఇచ్చేస్తున్నట్టు బాధపడుతున్నారని విమర్శించారు. గ్రీన్ అంబాసిడర్ కార్మికులకి రావాల్సిన మొత్తం బకాయిలు చెల్లించకపోతే యూనియన్ జిల్లా కన్వీనర్ పురం అప్పారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల న్యాయమైన కోర్కెలను కూడా నెరవేర్చే దశలో జగన్ ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం చాలా సిగ్గు చేటని అన్నారు. బకాయి జీతాలు ఇవ్వడం లేదు, పిఎఫ్, ఇఎస్ఐ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి జాబ్ కార్డులు ఇవ్వలేదన్నారు. భద్రత లేని పనిలో కార్మికులు ఉన్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి నేతృత్వంలో దశలవారి పోరాటాలకి శ్రీకారం చుట్టామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండిపట్టు విడనాడి సమస్యలు పరిష్కరించాలని లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అధ్యక్షుడు బొత్స పోలు రాజు, కార్యదర్శి దాసరి పూడయ్యా, దాసరి అయ్యప, కెల్ల రాము, కార్మికులు పాల్గున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మద్దతు తెలపండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బాడంగి/తెర్లాం: బాడంగి మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు నియోజకవర్గంలో పట్టభద్రులంతా మద్దతు తెలపాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. బాడంగి మండలం వాడాడ గ్రామంలో ఎమ్మెల్సీ సుధాకర్ తరపున ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. వైసీపి ప్రభు త్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఈనెల 13న జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామంలో ఎమ్మెల్సీ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి సూర్యనారాయణ,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-జామి : మండలంలోని జామి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ దేవుడుబాబు చెప్పారు. సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఈ కోత విధించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపో తుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సబ్ స్టేషన్ పరిధిలోని జామి, అలమండ, శ్రీచక్ర, లక్ష్మీపురం, జాగారం, పావాడ, వీరభద్ర పేట, ఆలుగుబిల్లి, కొట్టం, తాండ్రంగి, విజినిగిరి, తానవరం, అప్పన్నపాలెం, భీమసింగి, శాసనపల్లి, వెంకట రాజుపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శ్రీ యల్లమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర -శృంగవరపుకోట: సంతగయిరమ్మపేట గ్రామదేవత శ్రీ యల్లమాంబ అమ్మవారి జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనువాసరావు, ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్కుమార్, సీనియర్ నాయకులు గోగాడ అప్పారావు, గోగాడ అప్పలసత్యం, గోగాడ సత్యం మాస్టారు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ ప్రజల ఇలవేల్పు దేవతగా భాసిల్లుతున్న ముత్యాలమ్మ తల్లి అమ్మవారి 3వ రోజు తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. అలాగే గురువారం ఉదయం 5 గంటల నుంచి పసుపు కుంకుమలతో దూప, దీప నైవేద్యాలతో భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం 4గంటల నుంచి ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. 5 గంటల నుంచి జరిగిన ఎడ్ల పరుగు పందెం హోరా హోరీగా సాగింది. ఈ ఉత్సవంలో జాగరపు పెద్ద రామునాయుడు, గొర్లె పోటు రాము, మాజీ ఉప సర్పంచ్ అర్జున, గ్రామ ఉప సర్పంచ్ గేదెల సత్యారావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలుచేయాలి

ఓటింగు విధానంపై ఓటర్లకు అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం/పార్వతీపురం టౌన్: ఈనెల 13న జరగనున్న శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలలో నిబంధనలు పక్కాగా అమలు చేయాలని, ఓటింగువిధానంపై ఓటర్లకు ముందుగానే అవగాహన కల్పించాలని జిల్లాకలెక్టరు నిశాంత్ కుమార్ పోలింగు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పోలింగు అధికారులకు, సహాయ పోలింగు అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈశిక్షణ లో పాల్గొన్న జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికలను నిబంధనలను పక్కాగా అనుసరించి, వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సు నిర్వహణను సంపూర్ణంగా తెలుసుకోవాలని, ముందుగానే దానిపై పూర్తిగా అబ్యాసన చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ లో అనుమానాలుంటే ముందుగానే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు.పోలింగు కేంద్రానికి పాలింగు అధికారులు ముందురోజే చేరుకోవాలని, పోలింగు కేంద్రంవద్దనే అధికారులు ఏర్పాటుచేసిన వసతిలోనే బసచేయాలని, వారికి వసతిఏర్పాట్లు తహశీల్దారు చేస్తారని చెప్పారు. స్థానికులనుండి ఎటువంటి వసతి,ఆతిధ్యం స్వీకరించకూడదని తెలిపారు. ముందురోజే పోలింగు కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ఉదయం 6.30కు పోలింగుకు సిద్ధంకావాలన్నారు. 8గంటలకు పోలింగు ప్రారంభించి సాయంత్రం 4గంటలకు ముగించాలన్నారు. పోలింగు ఏజెంట్లు నిర్ధీత సమయంలోగా హాజరుకావాలని తెలిపారు. పోలింగు ఏజెంట్లకు అభ్యర్థులు ఇచ్చిన లెటరు, వారి గుర్తింపు సరిచూసుకోవాలన్నారు. పోలింగు

కుక్కలదాడిలో మరో కృష్ణజింక మృతి

అటవీశాఖ అధికారుల సమక్షంలో ఖననం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని జోగంపేట ప్రతిభా కళాశాల ప్రక్కనే గురువారం ఉదయం అనుకోకుండా ఒకజింక తీవ్రగాయాలతో కొన ఊపిరితో కనిపించింది.దీన్ని గమనించిన స్థానికులు అటవీఅధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖకు చెందిన ఎం.మనోజ్ మనోహర్ అక్కడకు చేరుకునే సమయానికి జింక్ మృతి చెందింది. జోగంపేట సమీపంలోగల ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి, అక్కడ గుమ్మితీసి అటవీశాఖ పరివేక్షణలో పశువైద్యులు రామారావు, పశువైద్య సచివా లయం సహాయకులు పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కలదాడితో బలం గా గాయాలు కావడంతో మృతి చెందినట్లు ఆయన చెప్పారు. అనంతరం దాన్ని పాతిపెట్టారు. గత ఆదివారం ఒక జింక కుక్కల దాడిలో మృత్యువాత పడగా నేడు మారో జింక కుక్కల దాడిలో మృతి చెందడం గమనార్హం.వేసవిలో నీటికోసం వేకువ జామున జింకలు రోడ్డు వైపు వస్తూ ఇటువంటి ప్రమాదాలు జరిగి జింకలు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు అంటున్నారు.

సమస్యలపై పోరాడే డా. రమాప్రభను గెలిపించండి

పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మదరావు

విశాలాంధ్ర -బెలగాం: ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాడే పట భద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డా. కె. రమాప్రభను గెలిపించాలని సిపిఐ పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ సమితి జిల్లా కార్యదర్శి కూరంగి మన్మద రావు, జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవన్ కోరారు. పార్వతీ పురం పట్టణంలో గురువారం సిపిఐ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచార కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరెడ్ల రమాప్రభ 250కి పైగా ప్రజాసంఘాల మద్దతుతో ఉత్తరాంధ్ర పట్ట భద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారని, ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస నెంబర్ 11కి ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుచున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతోమంది త్యాగాలతో కట్టుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం కాకుండా, ఉక్కు రక్షణకై, బిఎస్ఎన్ఎల్, రైల్వే, ఎయిర్పోర్టు, బ్యాంకులు ప్రైవేటుపరంకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి రమాప్రభ అని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, కర్షక సమస్యల పైన ప్రతిరోజు పోరాడుతున్న రమాప్రభను గెలిపించాలని ప్రతి ఒక్కరిని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, మోహన రావు, సింగన్న, జి.జనార్ధన, బొత్స మోహనరావు, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి

విశాలాంధ్ర -భామిని: భామిని మండలంలో పట్టభద్రులంతా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైసిపి కన్వీనర్ తోట సింహాచలం మాట్లాడుతూ సీఎం బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికే మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బోనగడ్డి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, మజ్జి మోహన రావు, మేదిబోయిన చలపతి, అగుతముడి రవి తింగ అన్నజీ, పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర-బెలగాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కళాశాల వార్షికోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అధ్యక్షతన వేడుకగా నిర్వహించారు. ఈ వార్షిక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి గా పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆకుల రాజు వార్షిక నివేదికను సభకు తెలియజేసి కళాశాలలో చిత్తశుద్ధితో, శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న బోధనా సిబ్బంది ఉండడం వల్ల విద్యార్థులకు మంచి ఉన్నతమైన బోధన అందుతుందన్నారు.

ఎన్నికల సమయంలో మద్యం షాపుల మూసివేత

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్కు మార్చి 13న జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 135-సి సెక్షను కింద 11.03.2033సాయంత్రం 4గంటల నుండి నుండి 13.03.2023 సాయంత్రం పోలింగు ముగిసేవరకు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో మద్యం షాపులను మూసివేయాలని జిల్లా కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్ నిశాంత్ కుమార్ ఆదేశాలు జారీచేసారు. ఈఆదేశాల ప్రకారం పార్వతీపురం మన్యంజిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఈనెల11న సాయంత్రం 4గంటల నుండి 13న సాయంత్రం పోలింగు ముసిగేవరకు పోలింగ్ జరిగే ప్రాంతాలలో డ్రై డేస్ పాటించాలని ఆదేశాలు జారీచేశారు. అన్ని రిటైల్ అవుట్ లెట్స్, బార్లు, కల్లుదుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.

రక్తదానంచేసి ప్రాణదాతలు కండి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: ప్రతీ ఒక్కరు రక్తదానంచేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. గురువారం జిల్లా అగ్నిమాపక కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడంవలన ఆపదలోగల మరొకరిప్రాణం కాపాడటం జరుగుతుందని,దీనిని అర్ధంచేసుకొని ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడంద్వారా బలహీన పడతామనే అపోహనువీడాలని, రక్తదానం చేయడం వలన మరింత ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. రక్తదాతలను జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమం ద్వారా 30యూనిట్లు రక్తం సేకరించినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో అగ్నిమాపక సిబ్బంది, భాస్కర డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని రక్తదానం చేసారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, డాక్టర్. హరిజగన్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

15 నుండి రిలేదీక్షలు విజయవంతం చేయాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ & ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు

విశాలాంధ్ర-బెలగాం: ఈ నెల15,16,17 తేదీలలో అగ్రిగోల్డ్ బాధితులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్షలు, సత్యాగ్రహ కార్యక్రమాల నిర్వహణకు అగ్రిగోల్డ్ బాధితులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసినదిగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ %ఏ% ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు కోరారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తుల విక్రయానికి సత్వరమే ప్రభుత్వం ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ఆస్తులను విక్రయించి డిపాజిట్ దార్లకు డబ్బు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి మంగళవారం విజయవాడ దాసరి భవన్లో తీర్మానం చేసిందని కంపెనీ ఆస్తులను విక్రయించి బాధితులకు డబ్బు చెల్లించడానికి సిఎం జగన్మోహన్ రెడ్డికి వచ్చిన అడ్డంకులు ఏమిటో చెప్పాలని, సత్వరమే ఆస్తుల విక్రయానికి సమర్ధ అధికారి నేతృత్వంలో ప్రత్యేక ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ వివాదాల పరిష్కారానికి రోజువారి విచారణ జరగనున్నట్లు పేర్కొన్నారని, ఇంకా ఎన్నాళ్ళు సమస్యను సాగదీస్తారని, అగ్రిగోల్డ్ సమస్యను తేల్చుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా బాధితులందరూ సిద్ధం కావాలన్నారు. ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 15,16,17 తేదీలలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్షలు, సత్యాగ్రహం చేయనున్న నేపథ్యంలో బాధితులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల ఆందోళనలు చేపట్టనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి సాలాపు అనంతరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని గెలిపించాలి : టిడ్కో చైర్మన్

విశాలాంధ్ర- సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ సుధాకర్ ను గెలిపిం చాలని కోరుతూ రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని మరిపివలస గ్రామంలోగల వై కె ఎం బిఈడి, సాంకేతిక కళాశాలలో గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. ఇటీవల విశాఖలో మూడు రోజుల పాటు జరిగిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా 340 క్రొత్త పారిశ్రామిక ఒప్పందాలు, రాబోయే రోజులలో 6 లక్షల క్రొత్త ఉద్యోగాలకల్పన 13 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం జరుగుతుందన్నారు.దీనివలన ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాల కల్పన జరుగుతోందని వివరించారు. ప్రభుత్వము అమలు చేస్తున్నటువంటి అనేక సంక్షేమపథకాలు చూసి ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఫకీరు నాయుడు, చుక్క లక్ష్మునాయుడు, ఇతర గ్రామపెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు, గ్రామప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-పాలకొండ: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో ఆవరణ ముందు గురువారం ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బీకెమూర్తి, డిపో ఇన్చార్జి సెక్రటరీ తుమ్మెద గౌరీశ్వరరావు ఆద్వర్యంలో భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని, స్థానిక ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి బీకె మూర్తి మాట్లాడుతూ ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలకొండ డిపోలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులందరికీ వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వార్మింగ్ డే విజయవంతం చేయండి

ఐటీడీఏ పీవో నవ్య

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పాలకొండ నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, సిడిపిఓలు, ఎంఈఓ లతో ఐటి డి ఏ పిఓ బి.నవ్య సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ 0 నుండి 19 సంవ త్సరాల లోపు పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో నులుపరుగు మాత్రలు వేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పివో నవ్య అధికారులకు సూచించారు. డిఎం అండ్ హెచ్ఓ జగన్నాధరావు మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్నటువంటి వైద్యాధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని నులిపురుగు మాత్రలు విద్యార్థులకు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం విజయ పార్వతి, ఎంపీడీవో గీతాంజలి, సిడిపిఓ రంగలక్ష్మి, ఎంఈఓ ఆనందరావు, ఓ ఎస్ డి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

34 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో సేవలు...

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: తెరిసా క్లబ్ తన 34 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలు అందిస్తోందని కోరుకొండ సైనిక్ స్కూల్ ఏవో అభిలాష్ బాలచంద్రన్ అన్నారు. తెరిసా క్లబ్ 34వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలచంద్రన్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో 34 సంవత్సరాల క్రితం ఒక చిన్న సేవా సంస్థగా ఆవిర్భవించిన తెరిసా క్లబ్ జిల్లాలోని ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తూ ముందుకు సాగుతుందని, ప్రజలకు సేవలు అందించడంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని కొనియాడారు. ప్రధానంగా మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ, స్కిల్ డెవలప్మెంట్ వంటి ఎన్నో దీర్ఘకాలిక ప్రయోజనకరమైన సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగుల వద్ద ఉండే సహాయకులకు ప్రతిరోజు నిత్య అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి కెటి కురియకోస్ మాట్లాడుతూ సేవే పరమావధిగా స్థాపించిన తెరిసా క్లబ్ అంచెలంచెలుగా జిల్లాలో ఒక ప్రధానమైన క్లబ్ గా అవతరించిందంటే ప్రజలు సహాయ, సహకారాలతో పాటు క్లబ్ అభివృద్ధిలో క్లబ్ సభ్యులే కారణమని అన్నారు. ఈ క్లబ్ సభ్యులు సహకారము, దాతల సహకారంతోనే ఇంతటి స్థాయిలో ప్రజలకు సేవలు అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఈ క్లబ్ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ వ్యాపారవేత్త గుడిసె శ్రీనివాసరావు తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలతో పాటు ఘంటసాల స్మారక కళ పీఠం వ్యవస్థాపకులు భీష్మ ఆర్కెస్ట్రా బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు జే వి వి ఎస్. మూర్తి, జి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి

తహశీల్దార్ పెన్షనర్ల సంఘ నేతలు వినతిపత్రాలు సమర్పణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు పెండింగులో ఉన్న మెడికల్ బిల్లుల తో పాటు పీఆర్సీ ఎరియర్లు, డీఆర్ ఎరియర్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి మీ ద్వారా తెలియచేయాలని కోరుతూ తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, ఉప ఖజానా శాఖాధికారికి తాలూకా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు బైరాగి రాజు ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా తాలూకా సంఘ అధ్యక్షుడు బైరాగిరాజు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా పెన్షనర్ల సంఘ ఆదేశాలు మేరకు విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. తమకు సకాలంలో మెడికల్, పీఆర్సీ, డీఆర్ ఎరియర్ల బిల్లులు మంజూరు కాకపోవడంతో వృద్ధులైన తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించక పోతే రాష్ట్ర న్యాయకత్వం ఆదేశాల మేరకు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు సూరిబాబు, ఎస్.అప్పారావు, శంకరరావు, సత్యం, రామనారాయణ రావు, అంబటి సూర్యనారాయణ, కృష్ణమూర్తి, నానిగిరి రమనాజీ, వల్లయ్య, మోపాడ కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు..

కిడ్నీ రోగికి ఆర్థిక సహకారం

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: జిల్లా ఎయిర్ ఫోర్స్ వెటరన్స్ అసోసియేషన్ వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుడతనాపల్లికి రెడ్డి చంద్రకళ కు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. చంద్రకళ భర్తకు గత కొద్ది నెలలుగా కిడ్నీలు దెబ్బతినడం తో డయాలిసిస్ చేసుకుంటున్నారు. జిల్లా సైనిక సంక్షేమధికారి మజ్జి కృష్ణారావు చేతులమీదుగా 13500 రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి మాట్లాడుతూ ఎయిర్ ఫోర్స్ వెటరన్స్ ఈ విధంగా సమాజసేవ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తాము బతకడమే కాదు ఇంకొంతమందిని బతికించే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. కార్యక్రమం లో అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావు, ఉపాధ్యక్షులు మురళి, కార్యదర్శి మధు, కోశాధికారి నాగభూషణం, సీనియర్ వెటరన్స్ ఎం. సి. రెడ్డి, కృష్ణయ్య, నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు ఉచిత భోజనాలు ఆనందదాయకం

పిహెచ్‌సి వైద్యాధికారి డా. భాగ్యరేఖ

విశాలాంధ్ర-జామి: నెలవారి తనిఖీలకు ఆసుపత్రికి వస్తున్న గర్భిణీలకు, వారి సహా యకులకు, వైద్య సిబ్బందికి నెల నెల ఉచితంగా భోజనాలు అందించడం ఎంతో ఆనందదాయకమని జామి పిహెచ్సి వైద్యాధికారి డా. ఎస్.భాగ్యరేఖ అన్నారు. గురువారం పీహెచ్సీలోని గర్భిణీలకు తనిఖీల అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. ఈనెల భోజనాన్ని రిటైర్డ్ ఎస్సై దివంగత రంపా చిట్టిబాబు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రంప శ్యామల ఆయన కుమారుడు, కృష్ణ క్లాత్ స్టోర్ యజమాని రంపారామాలు అందించారు. దాదాపు 100 మందికి పైగా భోజనాలు చేసి దాతలను అభినందించారు. ప్రతి నెల ఇలా భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల దాతల ఔదార్యాన్ని మెచ్చుకోవాలని వైద్యాధికారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్ల మహంతి నారాయణరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విన్నకోట నానాజీ, కిషోర్, మానాపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-దత్తిరాజేరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఏ సూర్య కుమారి ఆదేశాల మేరకు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు నినాదాలు చేశారు. పెళ్లి వద్దు-విద్య ముద్దు, బాల్య వివాహాలను అరికడదాం-బాలల స్వేచ్ఛను కాపాడుదాం. ఆడపిల్ల పుడితే భారం కాదు-ఆడపిల్ల పుట్టడం అదృష్టం, ఆడపిల్ల లేని ఇల్లు-చందమామ లేని ఆకాశం ఒక్కటే,ఈ కార్యక్ర మంలో ఈ ఓ పి ఆర్ డి వాణిశ్రీ, పి.హెచ్.సి సిబ్బంది, వెలుగు సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సేవలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సేవలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ టెలికాం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (సెక్యూరిటీ) మనోజ్ కుమార్ తో గురువారం సెల్ టవర్ల ఏర్పాటుపై చర్చించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలు, మొబైల్ సేవల అవసరాలపై జిల్లా మాప్ ద్వారా వివరించారు. జిల్లాలో 182 టవర్లు మంజూరు అయ్యాయని ఆయన చెప్పారు. బి.ఎస్.ఎన్.ఎల్, జియో, ఎయిర్ టెల్ సంస్థలు టవర్లు నిర్మిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో టవర్లు రావడం వలన కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, ప్రజలకు బాహ్య ప్రపంచానికి అనుసంధానం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుందని, టవర్లు వేగవంతంగా పూర్తి చేయుటకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మే చివరి నాటికి కనీసం వంద టవర్లు వినియోగంలోకి వచ్చుటకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. టెలికాం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (సెక్యూరిటీ) మనోజ్ కుమార్ మాట్లాడుతూ టవర్లు వేగంగా నిర్మించి సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఈసమావేశంలో టెలికాం అధికారులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో ఎస్ ఎస్ ఆర్ పేట గ్రామా నికి చెందిన జి ఉమా గురువారం అనుమానాస్పద మృతి చెందింది. అదే గ్రామంలో నేల బావిలో శవమై కనిపించింది. డెంకాడ మండలం, పినతాడివాడ గ్రామానికి చెందిన మృతురాలి తల్లి కమ్మిండి ముత్యాలమ్మ గుర్ల పిఎస్‌లో ఫిర్యాదు చేసింది. తన కుమార్తె కమ్మిండి ఉమను ఎస్ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన గుంటుమాని ఉమను రాముకి ఇచ్చి 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది వీరికి ఇద్దరు సంతానం. బుధవారం రాత్రి ఆమె అల్లుడు రాము, ఆమె కొడుకు ఈశ్వరరావు ఫోన్ చేసి మీ కుమార్తె ఉమా కనిపించకుండా పోయినట్లు చెప్పగా, అతడు బయలుదేరి ఎస్ఎస్ఆర్ పేటలో వెతికారు. గురువారం పొలం బావిలో ఉమ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫిర్యాదుపై, గుర్ల ఎస్ఐ శిరీషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవ వేడుకలు

మిన్నంటిన సంబరాలు..

విశాలాంధ్ర-విజయనగరం: మహిళా దినోత్సవ సంబరాలు మిన్నంటాయి. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఈ వేడుకలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాలు ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలతో హోరెత్తాయి. బాల్య వివాహాలను నిర్మూలించాలని, టీనేజ్ గర్భాలను నివారించాలని నినాదాలు చేశారు. జిల్లా చరిత్రలోనే తొలిసారిగా, జిల్యావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో భారీ ఎత్తున నిర్వహించిన ర్యాలీలు, మానవ హారాలు, సదస్సులు తదితర అవగాహనా కార్యక్రమాలు ప్రజల్ని చైతన్య పరిచాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, సఖి గ్రూపు సభ్యులకు వ్యాసరచన, వక్తృత్వం, క్రీడా పోటీలను నిర్వహించగా, విజేతలకు గురువారం ఆయా మండల కేంద్రాల్లో బహుమతులు అందజేశారు. పలుచోట్ల ఫుడ్ ఫెస్టివల్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వివిధ రంగాల్లో ప్రసిద్ధ, ప్రముఖ మహిళలకు, అధికారిణులకు ఈ సందర్భంగా సన్మానించి, వారి ప్రతిభను, చేసిన సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, ఇతర శాఖల మండల స్థాయి అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, పొదుపు సంఘాల సభ్యులు, సచివాలయ మహిళా ఉద్యోగు లు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎస్.కోటలో ...

కలెక్టర్ ఏ నర్యకుమారి ఆదేశాల మేరకు ఎస్.కోట మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. 8వ తేదీన హెూలీ కారణంగా సెలవుదినం కావడంతో 9వ తేదీ గురువారం నాడు ఈ వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయం నుంచి దేవీ బొమ్మ సెంటర్ వరకు మండల ప్రత్యేక అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.ఎస్.ఎన్.దొర నేతృత్వంలో వెయ్యి మంది మహిళలతో ర్యాలీ నిర్వహించి అక్కడ పాఠశాల విద్యార్థినులతో కలసి మానవహారం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు నిరోధించాలని కోరుతూ మహిళలు, బాలికలు నినాదాలుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నులు, మహిళలతో బాల్యవివాహాలు నిరోధిస్తా మంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సఖి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

గజపతినగరంలో...

మండల కేంద్రమైన గజపతినగరంలో మహిళా దినోత్సవ వేడులకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో మహిళలతో ఒక ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పించారు.

విజ్జీ స్టేడియంలో....

జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చీఫ్ కోచ్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఫెన్సింగ్(కత్తి సాము) వంటి యుద్ధ క్రీడలను ప్రదర్శించారు. పలువురు మహిళా క్రీడాకారిణులు ఇందులో పాల్గొన్నారు.

భోగాపురంలో....

మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి పద్మావతి నేతృత్వంలో మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. భోగాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వయంశక్తి సంఘాల మహిళలు, ఉపాధిహామీ వేతనదారులు, సచివాలయ మహిళా ఉద్యోగులు, మహిళా వలంటీర్లు, వెలుగు సిబ్బంది సహా 2500 మందితో ర్యాలీ, మానవహారం నిర్వహించి బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలకు బహుమతులు అందజేశారు.

బొండపల్లిలో ఫుడ్ ఫెస్టివల్

మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల ప్రత్యేక అధికారి, భూగర్భ జలశాఖ అధికారి దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. క్రీడాపోటీలు నిర్వహించి విజేతలైన బాలికలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంలో తక్కువఖర్చుతో అధిక దిగుబడి

- ఎన్నికల కోడ్ పూర్తయ్యాక పార్వతీపురం,కురుపాం, సాలూరు
- రైతుబజారులో ప్రకృతి వ్యవసాయ కూరగాయల అమ్మకాలకు ఏర్పాట్లు చేయండి
- పిఎండిఎస్ పై రైతుల్లో అవగాహన పెంచండి
- జిల్లాలో ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచేందుకు కృషిచేయాలి: జేసీ ఆనంద్

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేయడం ద్వారా తక్కువఖర్చుతో అధికదిగుబడి సాధ్యమని,రైతులు ప్రకృతి సాగువిస్తీర్ణంపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. గురువారం ఉదయం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో ఏపీ సిఎన్ఎఫ్ ద్వారా రైతులు సాగుచేస్తున్న పంటలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగువిస్తీర్ణం పెంపు, ఉత్పత్తులకు తగ్గమార్కెటింగ్, రబీలో పంటలసాగు తదితర అంశాలను తెలుసుకొని ఆయన పలుసూచనలు చేశారు. రైతులతో ప్రకృతి వ్యవసాయ సాగును, కలిగేలాభాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగులో వాడే ద్రవజీవామృతం, బీజామృతం, విత్తన గుళికలు తయారీని ఆయనకు చేసి చూపించారు. తక్కువఖర్చుతో మంచి దిగుబడి వస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల పంటలను ఆయన పరిశీలించారు. రైతులు ఖరీఫ్ సీజనుకు ముందు ఖాళీపొలాల్లో పిఎండిఎస్ విత్తనాలు జల్లడం వల్ల పెరిగే

భూసారం గూర్చి అవగాహణ పెంచాలని కోరారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయసాగును గణనీయంగా పెంచాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయసాగుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ పూర్తయ్యాక పార్వతీపురం,కురుపాం, సాలూరు రైతుబజారులలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న కూరగాయలు విక్రయించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు అదనపు డిపిఎం ధనంజయరావు, జిల్లా మార్కెటింగ్ అసోసియేట్ మంతిని మానస, జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్, ఎంటి నరసింహ, డివిజన్ ఇంచార్జి అప్పలనాయుడు, మండల ట్రైనర్ శ్రీరాములు, స్వామినాయుడు, మండల ఇంచార్జి రమణమ్మ, మాజీ ఎంపీటీసీ యాండ్రాపు చినరామినాయుడు, ఎంఏలు అనురాధ,తవుడు, ఎంసిఆర్పీ కమల గ్రామ రైతులు పాల్గొన్నారు.

తక్కువఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించేల పనులు చేయాలి

విశాలాంధ్ర- పార్వతీపురం/ పార్వతీపురం: టౌన్: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి పనులు చేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు చాంబరులో నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టులలో తక్కువ ఖర్చుతో సుమారు యాబది ఎకరాలకు నీరందించే వాటర్ షెడ్‌ల నిర్మాణాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. ఇప్పటికే గల వాటికి మరమత్తులు చేసి విని యోగంలోకి తీసుకురావాలని తెలిపారు. కనీసం ఒకపంటకు నీరందించే విధంగా కొత్తఆయకట్టుకు ప్రణాళిక రూపొందించాలని, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. చెక్‌డ్యాం నిర్మించి సోలారు మోట్లార్లద్వారా ఎగువ ప్రాంతానికి నీటిని పంపింగుచేసి, అక్కడ నుండి కాలువల ద్వారా భూముల కునీరు అందించే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేయాలని తెలిపారు. కాలువలు నిర్మాణ పనులను నరేగా నిధులతో చేపట్టాలని తెలిపారు. జూన్ 15వ తేదీకల్లా పనులు పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆర్. అప్పలనాయుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు మద్దతు తెలపండి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కు నియోజకవర్గంలో పట్టభద్రులంతా మద్దతు తెలపాలని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. బాడంగి మండలం వాడాడ గ్రామంలో ఎమ్మెల్సీ సుధాకర్ తరపున ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామంలో ఎమ్మెల్సీ ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి సూర్యనారాయణ,వైసీపీ నాయకులు మార్పిన సత్యం,గొట్టాపు రామారావు,పూడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును గెలిపించండి

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ తరుపున పోటీచేస్తున్న డాక్టరు వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యదిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పిలుపునిచ్చారు.గురువారం పట్టణంలోని పలువార్డులలో టీడీపీనాయకులతో కలిపి ప్రచారాన్ని నిర్వహించారు.పట్టభద్రుడైన ప్రతీఓటరు తమ అమూల్యమైన ఓటును ఆలోచనచేసి విజ్ఞుడైన చిరంజీవిరావుకు వేయాలని కోరారు. విద్యావంతుడైన చిరంజీవిరావును గెలిపిస్తే పట్టభద్రులు సమస్యలపట్ల అవగాహనఉన్నందున వారిసమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తారని చెప్పారు.ఈప్రచార కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, టిడిపిపట్టణ మండల పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహన్, టీడీపి నాయకులు గర్భాపు ఉదయభాను, తాతపూడి వెంకటరమణ, బడే గౌరు నాయుడు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, చందక దేశాలు, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థిగా టీడీపీ తరుపున పోటీచేస్తున్న డాక్టరు వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి, మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కోరారు. ఆయనతోపాటు టీడీపీనేతలు గొట్టాపు వెంకట నాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, బోనుచంద్రమౌళి, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సీతానగరం మండలంలోని పలుగ్రామాలలో టిడిపి నాయకులు చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. కార్యక్రమంలోటిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొల్లితిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్,టీడీపి నాయకులు బుడితి శ్రీనివాసరావు, పైల నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

ప్రత్యేక అధికారి గోవిందరావు

విశాలాంధ్ర-రామభద్రపురం: మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మండల ప్రత్యేక అధికారి ఎన్ గోవిందరావు అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మహిళలతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. మహిళలను చులకనగా చూడకుండా ఉండాలని కోరారు. మహిళలు అని రంగాలలో మగవారి కంటే ఉన్నతమైన స్థానాలలో రాణిస్తున్నారని అన్నారు. మహిళలు లేనిదే సమాజము లేదనికొనియాడారు. ఎంతోమంది శ్రీమూర్తులు దేశ గౌరవాన్ని నిలబెడుతున్నారన్నారు. ఎంపీడీవో రమ మనీమాట్లాడుతూ మహిళలపై దాడులు జరుగుతున్నాయని వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకొని మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా గట్టి చర్యలు చేపడితే అప్పుడే మహిళలు సమాజంలో తిరగ గలుగుతారని అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు మహిళలతో, హై స్కూల్ విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

శాసనమండలి సభ్యునిగా సురేష్ బాబు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర -నెల్లిమర్ల: శాసనమండలి సభ్యునిగా పెనుమత్స సురేష్ బాబు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా సురేష్ బాబుకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరో అవకాశం కల్పించిన విషయం విదితమే. ఉదయం తాడేపల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా బి ఫామ్ ను సురేష్ బాబు అందుకున్నారు. అనంతరం శాసనసభ సచివాలయ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీలేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు.

చిరంజీవి రావుకి ఓటు వేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పట్టభద్రులు టిడిపి బలపర్చిన వేపాడ చిరంజీవికి మొదటి ప్రాధాన్యత వేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు కోరారు. గురువారం నెల్లిమర్ల మండలంలో మల్యాడ, వల్లూరు గ్రామాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగులకు వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని, పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కోసం పోరాడే వ్యక్తి చిరంజీవి రావుకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తెలుగు యువత మండల అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, నాయకులు మంగం శ్రీనివాస్, గ్రామ సర్పంచి పంచాది జగన్నాథం పాల్గొన్నారు.

సాయిదీపక్ ప్రజంటేషన్ కు పలువురు కితాబు

విశాలాంధ్ర-పాలకొండ: పట్టణానికి చెందిన సూరాబత్తుల సాయిదీపక్ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల(ఐతం) లో ఉత్తమ ప్రతిభకనబరిచి కళాశాల అధ్యాపకుల మన్ననలు, పాలకొండ పెద్దల మన్ననలు పొందాడు. సాయిదీపక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. భూకంపాలు, వాటి నివారణ, ప్రజలు ఎలా రక్షింపబడాలనే అంశాలపై తనదైన శైలిలో వివరించాడు. ఫెస్ట్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి తన సత్తాచాటాడు. పాలకొండ విద్యార్థి ఈ విధంగా ఉత్తమ ప్రదర్శన కనబరచడం వలన పాలకొండ పెద్దలు వైసీపీ నాయకులు పి. రాజశేఖరం, ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, ఎమ్మెల్సీ పి. విక్రాంత్‌లు అభినందించారు. అలాగే ప్రజంటేషన్ హెచ్‌వోడీ పి. దినకరన్‌తోపాటు పలువురు అభినందనలు తెలిపారు. సాయిదీపక్ తండ్రి పాలకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా, సాక్షి రిపోర్టరుగా పాలకొండ పట్టణంలో సేవలు అందిస్తున్నారు.

రెవెన్యూ సేవల సంఘ సమావేశం

విశాలాంధ్ర-పాలకొండ: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సర్వీసుల సంఘ సమావేశం గురువారం డివిజన్ అధ్యక్షులు సావిత్రి, గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథంల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి కోశాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వల్లా సన్యాసిరావును ఎన్నుకున్నారు. కోశాధికారిగా రాజేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. డివిజన్ సహాధ్యక్షుడు డి. బుచ్చయ్య మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పట్ల అంకిత భావంతో పనిచేసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదానంతో ఆరోగ్యం

నారాయణం శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: రక్తదానంతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్సిఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణంశ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్సిఎస్ చారిటబుల్ ట్రస్ట్, రామ నారాయణం, రోటరీ క్లబ్ విజయనగరం, విజయనగరం రోటరీ పార్వతీదేవి అంచాలియా వాలంటరీ బ్లడ్‌బ్యాంక్‌లు సంయుక్తంగా నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ లో పాల్గొని ఆయన మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు విడనాడాలని, రక్తదానం ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, వేసవిలో బ్లడ్‌బ్యాంకులలో రక్త నిల్వలు తగ్గిపోతాయి కాబట్టి ఆరోగ్యకరమైన వ్యక్తులు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పెద్దికృష్ణ రూ.50వేల విరాళం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లిలో నూతనంగా నిర్మించబోతున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణం నిమిత్తం చీపురుపల్లి పట్టణ జగన్నాథరాజు కాలనీ వాస్తవ్యులు పెద్దికృష్ణ కుటుంబ సభ్యులు 50.000 (యాభై వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు ఈ మొత్తాన్ని ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆప్పికొండ ఆది బాబు, గంట్యాడ విష్ణుమూర్తి రాయలస్వామి, సన్నిదాన సభ్యులు ఈశ్వరరావు. రమేష్. బాల నాగు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ లను సత్కరించిన రోటరీ

విశాలాంధ్ర-బొబ్బిలి: శాంతి భద్రతలను కాపాడే వృత్తిలో విధులను నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మహిళ పోలీస్‌లకు గురువారం బొబ్బిలి రోటరీ క్లబ్ ఘనంగా సత్కరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బొబ్బిలి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మంగమ్మతో పాటు మరో ఏడుగురికి పోలీస్ కార్యాలయంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, రోటరీ ప్రతినిధులు సిబ నాగేశ్వరరావు, ఎస్సైలు సిహెచ్ సత్యన్నారాయణ, జ్ఞాన ప్రసాద్‌లు దుస్సాలువాలుతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్న పనిచేసేచోట అనమానతలకు గురవుతున్నారన్నారు. రోజు రోజుకు మహిళలపై ,బాలికలపై హింస, దాడులు, లైంగిక దాడులు, మహిళల రవాణా పెరుగు పోతున్నాయన్నారు. వాటి నియంత్రణకు కృషి చేయాల్సిన అవసరం వున్నదని అన్నారు. కార్యక్రమంలో రోటరీ కోశాధికారి ఎన్ శ్రీనివాసన్.సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, ప్రతినిధులు రామకృష్ణ, శంకర రావు డేవిడ్ జె విక్టర్ లు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి వెంపాడ చిరంజీవి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర-రేగిడి : ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంపాడ చిరంజీవి రావు కే ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి తీరాలని, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, రేగిడి ఆమదాలవలస మండల మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణ నాయుడు కుమారుడు టిడిపి యువ నాయకులు కిమిడి వినయ్ కుమార్ లు పార్టీ నాయకులకు కార్యకర్తలతో అన్నారు. గురువారం వంగరం మండలం సీతారాంపురం స్థానిక పెట్రోల్ బంక్ ఆవరణంలో టిడిపి నాయకులు కార్యకర్తలతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను, రైతులను, జగన్ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వకుండాను, ప్రభుత్వ పెన్సనర్లకు సకాలంలో పెన్షను అందివ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని,అందరి కీ ఇబ్బంది పెడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని వారు అన్నారు.అందర్నీ బాదపెడుతున్న ఈప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నారు.టీడీపి, ప్రజల పార్టీయని చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్నిఅభివృద్ధి పథంలో నడిపించారని,ఆయన పెట్టిన అభ్య ర్థినిగెలిపించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వంగర ,రాజాం, సంతకవిటి, రేగిడి మండలాల తెలిసిన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెయింటైనెన్స్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పోతనాపల్లి ఎస్‌కోట సబ్‌స్టేషన్ మెయింటైనెన్స్ పనులు శుక్రవారం చేపట్టనున్నందున ఎస్.కోట, సీతంపేట, కృష్ణాపురం, భీమవరం, సంతగయిరమ్మపేట, తలారి, ఉసిరి, తిమిడి, వసి, వెంకటరమణపేట, కొత్తూరు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేసారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని, ఎన్నికలకు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు పాల్గొన్నారు.

ఆప్టోమెట్రీతో ఉన్నత భవిష్యత్

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఆప్టోమెట్రీ విభాగంతో ఉన్నత భవిష్యత్ ఉందని ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ వై.విజయ్ కుమార్ అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. అనంతరం విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ ఇక్కడ ఆప్టోమెట్రీ చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో తమ వద్ద అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. అనంతరం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, ఆప్టోమెట్రీ విభాగాధిపతి శ్రావణి, అధ్యాపకులు దినేష్, బెనర్జీ, తిలక్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ పాల్గొన్నారు.

ఫ్లూపై ఐసీఎంఆర్, ఐఎంఏ హెచ్చరికలు

డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఫ్లూ కేసులు నమోదు నమోదవుతున్నాయని, ఈ కేసులు చాలావరకు ఇన్ఫ్లూ ఎంజ్- ఏ ఉపరకం, హెచ్-3 ఎన్ -2 వైరస్ కారణమని ఐ సి ఎం ఆర్ ఐఎంఏ తెలిపిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్. వి. రమణకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర రకాల వైరస్లతో పోల్చితే ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఈ వైరస్ కారణంగా ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్నట్లు చెప్పారు. గత రెండు మూడు నెలలుగా హెచ్3ఎన్2 దేశవ్యాప్తంగా విస్తరించిందని ఐసిఎంఆర్ నిపుణులు హెచ్చరించినట్లు తెలిపారు. సాధారణ ఫ్లూ జ్వరంతోపాటు జలుబు, దగ్గు, మరికొందరిలో శ్వాస కోస సంబంధ సమస్యలు ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వైరల్ జ్వరం ఎక్కువగా పిల్లల ద్వారా కుటుంబంలో అందరికీ వ్యాప్తి చెందుతున్నట్లు తెలియజేశారు. ఈ వైరస్ లక్షణాలు ఉన్నవాళ్లు మాస్కులను ధరించి, కళ్ళు, ముక్కును తాకకుండా వీలైనంత ఎక్కువగా ద్రవపదార్థాలను తీసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరు

విశాలాంధ్ర - గజపతినగరం: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలోని మామిడి బంద కాలనీలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ నాయకులు మిత్తిరెడ్డి వెంకటరమణ, లంక చిన్నమనాయుడు, కర్రి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లు నిర్వహిస్తే చర్యలు: సీఐ

విశాలాంధ్ర - రామభద్రపురం: క్రికెట్ బెట్టింగుల ఎవరైనా నిర్వహించిన, పాల్గొన్న రౌడీ సీట్లు తెరుస్తామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుమలరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బెట్టింగులకు పాల్పడడం చాలా నేరమని, బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపవలసి వస్తుందని యువతను హెచ్చరించారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్/బెలగాం: అంగన్వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. గురువారం పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలోని 18వ వార్డు, 19వ వార్డు సమీకృత అంగన్వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు అందించుటకు వండిన ఆహరపదార్దాలను తనిఖీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రంనకు హాజరైన ప్రీ-స్కూలు పిల్లలకు నేర్పుతున్న ఆటలు, పాటలు పాడించినారు. అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపిద్దాం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను చూసి ఈనెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టబద్రులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని 38, 32 డివిజన్లో పర్యటించి పట్టభద్రులకు వైసిపి బలపరిచిన సీతంరాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో అనేకమంది శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఉండగా మరో ఎమ్మెల్సీ తోడైతే ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా, విద్యావంతుడిగా, సీతంరాజు సుధాకర్ సమర్థవంతమైన అభ్యర్థిగా తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్, జోనల్ ఇన్చార్జులు బాల బ్రహ్మారెడ్డి, గురుమూర్తి, బొద్దాన అప్పారావు, 32వ వార్డు కార్పొరేటర్ భోగాపురవు లక్ష్మి, డివిజన్ ఇన్చార్జి నారాయణప్పడు, వైసీపీ నాయకులు భోగాపురపు రవిచంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: వైసీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. పట్టణంలో కొత్త గవిడి వీధి, ఆంజనేయపురంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ యువజన నాయకులు గౌ!!శ్రీ!!బెల్లాన వంశీకృష్ణ గారు చీపురుపల్లి మండల వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, జిల్లా టెలికాం బోర్డ్ సభ్యులు ఇప్పిలి తిరుమల, చీపురుపల్లి సర్పంచ్ ప్రతినిధి మంగళగిరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెరిడ రామదాను, సువ్వాడ అప్పలనాయుడు, వార్డు మెంబర్లు తమ్మిన శేఖర్, మీసాల శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపి ంచాలని కోరుతూ ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు తదితరులు కరపత్రాలు అందజేశారు. ఎస్.కోట మండలంలోని పోతనాపల్లి, కృష్ణాపురం, తలారి గ్రామాల్లో గల గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను, ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జె.సి.ఎస్ మండల కన్వీనర్ కె.వెంకటరావు, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, సర్పంచ్ యామిని, తలారి అనంత్, మాజీ సర్పంచ్ పోతయ్య, నాయకులు మజ్జి గంగరాజు, వాకాడ రమణ, రమేష్, తిమిడి సతీష్, జె.వి.ఎస్ ప్రసాద్, ఆర్మీ శంకర్, అప్పలరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం:ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మొదటిప్రాధాన్యత ఓటును వేసి గెలిపిం చాలని సీతానగరం మండల వైసీపీ అధ్య క్షుడు బొంగు చిట్టిరాజు పిలుపునిచ్చారు. గురువారం పలు మండల కమిటీ, గ్రామ కమిటీ నాయకులు గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంద న్నారు. గతవారంరోజులుగా ఎమ్మెల్యే జోగారావు, పార్టీ ఆదేశాలు మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్సీపీ మండల, గ్రామకమిటీల నాయకులు,కన్వీనర్లు, విఓసిలు ప్రచారం చేస్తూ ముందుకు వెళు

న్నట్లు చెప్పారు. పార్టీ అదేశాలు మేరకు ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.తనతో పాటు మాజీ జెడ్పి చైర్మన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వాకాడ నాగేశ్వర రావు,ఎంపిపి ప్రతినిథి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పోల ఈశ్వర నారాయణ, నాయకులు కొట్నాన రత్నాకర్, తెంటు వెంకట అప్పలనాయుడు, అంబటి కృష్ణం నాయుడు,ఆర్వీ పార్థసారథి, బుడితి గౌరునాయుడు, దాసరి నాగరత్నం,సురేష్, ఆర్వీ కిషోర్, సర్పంచులు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, నాయకులు అభిమానులు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఇదిలాఉండగా పెదభోగీలి మేజర్ గ్రామపంచాయతీలో ఎంపీటీసీలు ఎస్ కిరణ్, బురిడి సూర్యనారాయణ, కూర్మారావు,రమేష్, పిల్లి సతీష్, ఆర్వీ కిషోర్,సురేష్, రామారావులు తదితరులు ప్రచారాన్ని నిర్వహించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సవరపు జయమని భర్త సవరపు రామారావు మాస్టారూ, మాజీ ఎంపిటిసి మాదవ్ లు ఇంటింటికి వెళ్లి సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ

విశాలాంధ్ర - వేపాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేపాడ చిరంజీవిరావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో మండల టీడీపీ నేతలు దూసుకుపోతున్నారు. గురువారం టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్‌ల ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, మండల పార్టీ కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మండల టీడీపీ నాయకులు పోతల వెంకటరమణ, బోజంకి మహేష్, వేచలపు జగ్గిబాబు, గుంటపల్లి దేముడు నాయుడు,నిరుజోగి బంగారునాయుడు, గోకేడ నాగభూషణం, అచ్చం నాయుడు (మద్దాలు), కోటాన అప్పలనాయుడు, అవతారం, జొన్నవల్లి రమణ కోలా అప్పలసత్యం, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, గొర్రుపోటు రాము తదితరులు మండలంలోని కేజీ పూడి, పికేఆర్ పురం, రామస్వామిపేట, బొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం తదితర గ్రామాలలో విస్తృతంగా పర్యటించి వేపాడ చిరంజీవిరావును మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాలలో టీడీపీ నాయకులు చల్లా వెంకటరావు, సూర్యనారాయణ, కన్నాజి, గొలగాని కృష్ణమూర్తి, జనపరెడ్డి ఈశ్వరరావు, దివదారి అప్పల నారాయణ, జామి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు సత్యసాయి ప్రేమ అమృత ప్రసాదం

విశాలాంధ్ర - డెంకాడ: మండలంలోని డెంకాడ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో డెంకాడ గ్రామానికి చెందిన రొంగలి చంద్రశేఖర్ దంపతులు ఆర్థిక సహకారంతో సత్యసాయి ప్రేమ అమృతం ప్రసాదం 40 మంది గర్భిణీలకు పంపిణీ చేశారు. అనంతరం నారాయణ సేవా మందిరంలో 150 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కు పనుల పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో గురువారం తహశీల్దార్ డి.రాజేశ్వర రావు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా తెర్లాం మండలం జె.కొత్తవలస గ్రామ రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సర్వే టీము తప్పకుండా రైతుల సమక్షంలోనే వారి వారి పొలాలను కొలతలు తీసుకోవాలని, అప్పగించిన పనిని ప్రభుత్వ నిబంధన మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతీ రైతు కూడా తమ పొలాలు దగ్గరకు సర్వే టీమ్ వచ్చినప్పుడు వారి యొక్క ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ తీసుకువచ్చి సర్వే టీమ్‌కు అందజేసి సహకరించాలని రైతులను కోరారు.

పర్వతారోహకుడికి నగదు ప్రోత్సాహకం

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఆఫ్రికాలో గల కిలిమాంజోరా పర్వతాన్ని అధిరోహించిన మెరుగుల నాగరాజుకి 5000 రూపాయలను విజయనగరం జిల్లా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ చీపురుపల్లిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) క్యాంప్ లికార్యాలయంలో అందజేశారు. ఉనుకూరి గ్రామం రేగిడి ఆమదాలవలస మండలం మెరుగుల నాగరాజు ఆఫ్రికాలో గల కిలిమంజార్ పర్వతాన్ని అధిరోహించారు. వెస్ట్ సిక్కింలో గల కాబ్రు సౌత్17650 అడుగులు, నార్త్ సిక్కింలో గల లాకా కొంటెస్ 17450 అడుగుల పర్వతాన్ని అధిరోహించారు ఇతను మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని వచ్చేనెల 3న అధిరోహించబోతున్నారు.

16 నుండి శ్రీ నూకాలమ్మవారి జాతర

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈ నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ నూకాలమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలిపారు. గురువారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జాతరకు సంబంధించిన కరపత్రాలను, ఆహ్వాన పత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించి మాట్లాడారు. విజయనగరం మంగళవీధి, పాత పశువుల మార్కెట్ ఆవరణలో శ్రీ నూకాలమ్మవారి 65వ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతీ ఏడాది మాదిరిగానే అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్ కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్‌బాబు, రాజేంద్రప్రసాద్, మజ్జి అప్పారావు, వెంపడాపు వెంకటరావు, మండల శ్రీనివాసరావు, పతివాడ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన వ్యతిరేక దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ క్లబ్ నడక మైదానంలో గురువారం శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు(సి.హెచ్.రమణ) ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని (నో స్మోకింగ్ డే) నిర్వహించారు.ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాస్టారు, క్లబ్ అధ్యక్షుడు సి.హెచ్.రమణ మాట్లాడుతూ పొగత్రాగటం ఆరోగ్యానికి హానికరమని, పొగత్రాగటం వలన ఎక్కువశాతం క్యాన్సర్ బారిన ప్రజలంతా పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వై.నలమారాజు, జాలీ వాకర్ గోవింద్, క్లబ్ సీనియర్ సభ్యులు వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ, ఆర్.సి.హెచ్. అప్పల నాయుడు, పైడయ్య, ఐ.వి.ప్రసాదరావు,"ఎనుమత్స అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూజీవీలో జాతీయ సాంకేతిక సదస్సు



విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జేఎన్‌టీయూజీవీలో కంప్యూటర్ విభాగానికి సంబంధించిన రెండు రోజుల జాతీయ సాంకేతిక సదస్సును గురువారం విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ కె వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం వారు ప్రతి సంవత్సరం విడుదల చేసే జైర్ మ్యాగ్జైన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర విభాగంలో ఉన్న ముఖ్యమైన కోర్సులపై అవగాహన పెంచుకోవా లన్నారు. సీనియర్ రీజినల్ మేనేజర్ హెడ్ ఎన్ ఆర్ డి సి డాక్టర్ బీజయ కుమార్ సాహు తృతీయ సంవత్సరం విద్యార్థి వై సాయి ఆదిత్య రచించిన పుస్తకం హ్యూమన్స్ ఆర్ డేంజర్ జోన్‌ను ఆవిష్కరించారు. 234 మంది విద్యార్థులు ఈ సాంకేతిక సదస్సులో వారి పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఆర్ డి డి వి శివరాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ప్రొఫెసర్ జి స్వామి నాయుడు, ప్రిన్సిపల్ కే కుమార్ డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే ధ్యేయం

విశాలాంధ్ర - వంగర: టీడీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు గెలుపే ధ్యేయమని జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రతిభా భారతి అన్నారు. గురువారం ఆమె శివ్వాము లో వివాహ వేడుకల్లోను, టీడీపీ గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సి అభ్యర్థి చిరంజీవిరావును గెలి పించాలని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చంద్ర బాబునాయుడు ఎవరికి సీటు ఇస్తే వారిని గెలిపించటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలలో మహిళలకి సముచిత స్థానం ఏది?

విశాలాంధ్ర - బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మన రాజకీయ నాయకులు, అధికారులు సామా జీక మాధ్యమాల్లో, బయట నానా హడావిడి చేస్తారు, అసలు రాజకీయాలలో మహిళలకి సముచిత స్థానం ఎంతవరకు ఇస్తున్నారో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ మన రాజకీయ నాయకుల తీరు చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్నది మహిళలనా లేక వారి భర్తలనా? అనే సందేహం కలుగుతుంది అన్నారు. పదవి మహిళలది పెత్తనం భర్తలదా? ఇదేనా మనం భహిళలకి ఇచ్చే గౌరవం అని, గత సారి జరిగిన సర్పంచ్, ఎంపీటీసీ, మునిసిపల్ ఎన్నికలలో అధికార పార్టీ వారు మహిళా అభ్య ర్థులను నిలబెట్టారని, ప్రజలు కూడా చాలా మంది మహిళలను ఓట్లు వేసి గెలిపించారని, అయితే ప్రభుత్వ కార్యక్రమాలలో, అధికారిక కార్యక్రమాలలో పదవిలో ఉన్న మహిళల కన్నా వారి భర్తలు పాల్గొనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

స్నేహ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఘన సన్మానం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: తమ తమ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయిని కర్ణాట నూకరత్నం, ఆర్టీసీ కండక్టర్ జీవీ లక్ష్మి, ఆశవర్కర్ ఎస్.కన్నమ్మ, రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కె.ప్రీతి, రాష్ట్ర ర్యాంకర్ షేక్ తానీషా బేగంలను స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. స్నేహ స్వచ్ఛంద సంస్థ 12వ వార్షికోత్సవం, జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సంస్థ అధ్యక్షుడు ఏఎస్ వెంకటరావు అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహ ప్రతిభ పరీక్షలో ప్రతిభ కనబరిచిన శృంగవరపుకోట మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.లావణ్య, స్నేహ సంస్థ ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, కోశాధికారి గణేష్, సభ్యులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ త్రినాధరావు, ఎంఎస్ఎన్ మూర్తి, మల్లా రామకృష్ణ, బి.భాస్కరరావు, విన్నకోట మురళి, రమేష్, ప్రకాష్, శ్రీను, అప్పలరాజు, తిరుపతిరావు, లక్ష్మణరావు, నరసింహారావు, షఫీ, రామనారాయణ, హరీష్, దేవుడు, జగన్నాథం పాల్గొన్నారు.

అనర్హులకు ఓటు హక్కును కల్పించిన వైసీపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఈ నెల 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లను ప్రభుత్వం తొలగించడంలో ఎన్నికల అధికారులు చోద్యం చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శృంగవరపుకోట పట్టణంలో టీడీపీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే లలితకుమారి గురువారం మాట్లాడుతూ అనర్హులకు ఓటు హక్కును కల్పించిన వైసీపీ నాయకులపై తగు న్యాయపరమైన చర్యలు తీసుకొనేవరకూ టీడీపీ ఊరుకోదని హెచ్చరించారు. అదేవిధంగా వీలైనంత త్వరగా రాష్ట్రంలోని పలు ఎమ్మెల్సీ పరిధిలో బోగస్ ఓటర్లు, చదువుకోలేని వారికి ఓటు హక్కును తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల క్లస్టర్ ఇన్‌చార్జిలు ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి శ్రీనివాసు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - తెర్లాం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెర్లాం మండల్ హెడ్ క్వార్టర్స్‌లో ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు అనుసరించి తెర్లాం మండల కేంద్రంలో మహిళ లోకాన్ని జాగృతిపరుస్తూ పెద్ద ఎత్తున దాదాపు 1200 మంది మహిళామణులతో కలిసి నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, మహిళల యొక్క శక్తి సామర్థ్యాలను గుర్తింపు చేసే విధంగా అంగరంగ వైభవంగా నాటక ప్రదర్శనలు, నృత్యప్రదర్శన గావించారు. ఈ నాటక ప్రదర్శనలో సఖి, సహేలి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమయినంలో సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి , పి.హెచ్.సి. పెరుమాలి డాక్టర్ కె. మాధవి పాల్గొన్నారు.

డెంకాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డెంకాడ ఎంపీడీవో కార్యాలయం పరిధిలో గురువారం ఎంపీడీవో డిడి స్వరూపరాణి ఆధ్వర్యంలో అన్ని శాఖల మహిళా ఉద్యోగులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డిడి స్వరూపారాణి వెలుగు కార్యాలయం ఏపీఎం విజయలక్ష్మిని ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎం.వి.జి.ఆర్ కళాశాలలో

ఎం.వి.జి.ఆర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్విటీ అనే థీమ్‌తో జరుపుకుంది. ఈ కార్యక్రమానికి. జిల్లా ఎస్పీ ఎం.దీపికా పాటిల్, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, క్రాంతి చలత్, ఎంవిజిఆర్ అలుమ్నాలు హాజరయ్యారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని సూచించే ఎం.వి.జి.ఆర్‌లో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలో అబ్బాయిలు కూడా పాల్గొనడం పట్ల ఆమె చాలా సంతోషించారు. ఎం.వి.జి.ఆర్ ప్రిన్సిపాల్ డా. కె వి ఎల్ రాజు, ప్రొఫెసర్ డి. రాజ్య లక్ష్మి, డీన్ ఎస్.మోహన్ కుమార్, డబ్ల్యు.ఇ.సి కన్వీనర్ డా. ఎం.సారా కమలా కుమారి, విద్యార్థి ప్రెసిడెంట్ ఏ.ఇందు జాహ్నవి, డబ్ల్యుఈసీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్లు, మహిళా సిబ్బంది, బాలికలు, బాలురు విద్యార్థులు పాల్గొన్నారు.

గజపతినగరం: గజపతినగరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో పురిటిపెంట సచివాలయం నుండి గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ జరిపి అనంతరం మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పప్పు సుదర్శనం, సిడిపిఓ నాగమణి, జగదీష్ కుమార్, మరుపల్లి పీహెచ్సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని డీఐఓ తనిఖీ

విశాలాంధ్ర - బెలగాం: స్థానిక బెలగాం చర్చివీది పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పర్యవేక్షణ చేశారు. ప్రతినెలా గర్భిణీల ఆరోగ్య తనిఖీల కొరకు ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణీలకు అవసరమైన అన్ని ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కార్డులో వైద్య సిబ్బంది నమోదు చేసిన పరీక్షల వివరాలను పరిశీలించారు. గర్భిణీలకు పలు ఆరోగ్య సూచనలు, సలహాలు తెలిపారు. క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కాల్షియం మాత్రలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. బి. పవన్, డా. బి.నిహారిక, సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేసిన సేవలకు గుర్తింపుగా పురస్కారాలు

విశాలాంధ్ర - వేపాడ: చేసిన సేవలకు గుర్తింపుగా కొన్ని శాఖలలోని మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పురస్కారాలను అందజేశారు. మండలంలోని ఆతవ సచివాలయం పరిధిలోని ఆకుల సీతంపేట ఏఎన్ఎం ఎమ్.దేవి, అంగన్వాడి కార్యకర్త రాజలక్ష్మి, ఆశా కార్యకర్త పి.కాంతమ్మ, వేపాడ విఓఏ ఎస్.లక్ష్మి, వేపాడ మండల సమైక్య సభ్యులు వెంకటలక్ష్మి, ఏ సుగుణ రాణిలకు ఉత్తమ ఉద్యోగులగా అవార్డు లను గురువారం ఎంపీడీఓ, వైద్యాధికారుల చేతుల మీదుగా అందించడం జరిగింది.